



లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

వేసవిలో ఉపాధి పనులు ముమ్మరం

- జూన్ నాటికి ఫార్మ్ పాండ్స్ పూర్తి చేయాలి
- జూన్ 12 ముఖ్యమంత్రి వచ్చే అవకాశం
- కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

వేసవి కాలంలో ఉపాధి పనులు ముమ్మరంగా కల్పించాలని, ఏప్రిల్, మే, జూన్ నెలల్లో 90 శాతం లక్ష్యాలను చేరుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఎంపిడిఒలను ఆదేశించారు. మంగళవారం ఉపాధి హామీ, గృహ నిర్మాణం, గ్రామ/వార్డు సచివాలయాల సేవలపై జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, ఎంపిడిఒలతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఏప్రిల్, మే, జూన్ నెల్లలో వ్యవసాయ పనులు తక్కువగా ఉంటాయని, కాబట్టి ఈ సమయంలో ఉపాధి హామీ పథకం కింద ఎక్కువ పని కల్పిస్తే కూలీలకు ప్రయోజనం ఉంటుందని అన్నారు. ఈ నెలలో పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కోడుమూరు, ఓర్వకల్లు, దేవనకొండ, చిప్పగిరి మండలాల్లో మంగళవారం నాటి రోజువారీ లక్ష్యంలో కేవలం 60 శాతం మందికి మాత్రమే పని కల్పించడంపై కలెక్టర్ ఎంపిడిఒలను ప్రశ్నించారు. ఏప్రిల్ నెలలో ఇప్పటివరకు పని దినాలు కల్పించడంలో మద్దికెర మండలం 21 శాతం లక్ష్యం సాధిస్తే, నందవరం, గోనెగండ్ల, హాలహర్వి, ఆస్పరి మండలాలు 7 శాతం లోపు లక్ష్యాలు సాధించడంపై ఆయా మండలాల ఎంపిడిఒలను కలెక్టర్ నిలదీశారు. వెనుకబడిన మండలాల ఎంపిడిఒలు, ఎపిఒలతో మాట్లాడి పనుల్లో పురోగతి తీసుకురావాలని, వచ్చే వారానికి కూడా ఇదే పరిస్థితి ఉంటే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డ్వామా పీడీని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 8,500 ఫార్మ్ పాండ్లను జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇంకా చాలా మండలాల్లో అనుమతులు (శాంక్షన్లు) ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ ఎంపిడిఒలను ప్రశ్నించారు.



మాట్లాడుతున్న కలెక్టర్

గూడూరు - 50, ఆలూరు - 100, కృష్ణగిరి - 90, కర్నూలు - 150, పెద్ద కడుబూరు - 100 ఫార్మ్ పాండ్లకు సంబంధించిన అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయని, వారం రోజుల్లో వాటిని పూర్తి చేయాలని, పనులు జూన్‌నాటికి పూర్తి చేయాలని, డ్వామా పీడిని, ఎంపిడిఒలకు స్పష్టం చేశారు. మద్దికెర మండలంలో 500 ఫార్మ్ పాండ్ ఏర్పాటు లక్ష్యం నిర్దేశిస్తే, 498 అనుమతులు పొందారని, 212 పనులు పురోగతిలో ఉన్నాయని, 140 పూర్తయ్యాయని కలెక్టర్ ఎంపిడిఒను అభినందించారు. ఆలూరు మండలంలో కూడా బాగా పనిచేశారని కొనియాడారు. మద్దికెర, ఆలూరు మండలాల ఎంపిడిఒలు చేస్తున్నప్పుడు మిగతా మండలాల ఎంపిడిఒలు ఎందుకు చేయలేకపోతున్నారని కలెక్టర్ ప్రశ్నించారు. ఓర్వకల్లు, కౌతాళం, తుగ్గలి, కోసిగి మండలాల్లో పురోగతి చాలా తక్కువగా ఉందని, పనులు వేగవంతంగా జరిగేలా చూడాలన్నారు.

జూన్‌లో సిఎం పర్యటన : జూన్‌లో 12 ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. గృహ నిర్మాణానికి సంబంధించి ఈనెల 19 నుంచి జూన్ 1వ తేదీ వరకు 11 వేలకు పైగా ఇళ్ల నిర్మాణం లక్ష్యం కాగా, అందులో 5,700 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, పెండింగ్‌లో ఉన్న 5,900 ఇళ్ల నిర్మాణాలు కూడా జూన్ 1వ తేదీ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇందులో ఆదోని డివిజన్‌లోనే ఎక్కువ శాతం పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ అంశంపై వారానికి రెండుసార్లు సమీక్ష నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. పెద్దకడబూరు, ఓర్వకల్లు, కర్నూలు, సి. బెళగల్, హొళగుంద, కోసిగి, మంత్రాలయం, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆలూరు, గోనెగండ్ల, పత్తికొండ ఎంపిడిఒలతో మాట్లాడుతూ జూన్ 12న ముఖ్యమంత్రి కార్యక్రమం ఉండే అవకాశం ఉందని, అంతలోపు వీటిని పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

జిఎస్‌డబ్ల్యుఎస్ (గ్రామ/వార్డు సచివాలయాల సర్వీసెస్)కు సంబంధించి ఈ-కెవైసిలో కర్నూలు, ఆదోని మున్సిపాలిటీలు, గూడూరు నగర పంచాయతీ, కౌతాళం, కోసిగి, గోనెగండ్ల, హాలహర్వి, పత్తికొండ మండలాల్లో చాలా పెండింగ్‌లో ఉందని, వాటిని మూడు రోజుల్లో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సచివాలయ సిబ్బందితో సమీక్షించి పురోగతి తీసుకురావాలన్నారు. జనన ధ్రువీకరణ పత్రాల (బర్త్ సర్టిఫికెట్లు) జారీలో ఎలాంటి పెండింగ్ లేకుండా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

దివ్యాంగ వారీగా ఆధార్ నమోదుపై సమీక్షించి పురోగతి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు ఆర్డిఒ, పత్తికొండ ఆర్డిఒలను ఆదేశించారు. ఐసిడిఎస్ అధికారులతో సమన్వయం చేసుకుని ప్రత్యేక దృష్టితో (డ్రైవ్ మోడ్‌లో) పురోగతి సాధించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ, కర్నూలు ఆర్డిఒ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డిఒ భరత్, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, డ్వామా పీడీ వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

లెనిన్ స్ఫూర్తితో పోరాటం

- సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో లెనిన్ జయంతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వి.ఐ.లెనిన్ 155వ జయంతిని సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు సిపిఎం జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జయంతి సభను ఉద్దేశించి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ ప్రసంగించారు. పెట్టుబడిదారీ వ్యవస్థను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రపంచంలోనే తొలిసారిగా మార్క్స్, ఎంగెల్స్ రూపొందించిన కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టి, కార్మిక వర్గ రాజ్యాన్ని సుదీర్ఘకాలం స్థాపించిన ఘన చరిత్ర లెనిన్‌ది అన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ అత్యున్నత రూపమే సామ్రాజ్యవాదం అని, సామ్రాజ్యవాదానికి ఎలాంటి దయా దాక్షిణ్యాలు ఉండవని, కేవలం లాభం కోసం పసిపిల్లల నుండి వృద్ధుల వరకు ఎవరినైనా బలిచేసి తమ పెట్టుబడిని పెంచుకునే ప్రయత్నం చేస్తుందని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలను పరిశీలిస్తే ఇది స్పష్టంగా అర్థమవుతుందని వారు అన్నారు. మన దేశంలో కూడా సామ్రాజ్యవాద దేశాల ఒత్తిడి మేరకు కార్పొరేట్ బడా పెట్టుబడిదారులకు సంపదను అప్పగించేందుకు కార్మికులను, రైతులను బలిచేస్తూ ఒప్పందాలు చేసుకుంటున్నారని విమర్శించారు. ఇందులో భాగంగానే అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వ్యాన్స్ భారతదేశాన్ని సందర్శించారని తెలిపారు. 55 సంవత్సరాలు జీవించిన లెనిన్ పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రపంచవ్యాప్తంగా వణుకు పుట్టించారని, లెనిన్ స్ఫూర్తితో కార్మిక కర్షక రాజ్యం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సామ్రాజ్యవాద అడుగుజాడల్లో నడుస్తూ ప్రజలను బలి చేస్తున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి. నిర్మల, జి. రామకృష్ణ, ఎండి. ఆనంద్ బాబు, కెవి.నారాయణ, ఎండి. అంజిబాబు, టి.రాముడు, కె.వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.అలివేలు, అరుణమ్మ, నరసింహ, రాజశేఖర్, నగేష్, గురు శేఖర్, వీర శేఖర్, లింగన్న, విజయ్, హనుమంతు, లక్ష్మన్న, గోవిందు, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు మృతి

- మట్టి పెల్లలు పడి ఊపిరాడక విగతజీవులయ్యారు
-ఒక్కొక్కరికి రూ.25 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలి: సిఐటియు



మృతి చెందిన భవన నిర్మాణ కార్మికులు



ప్రజాశక్తి-గూడూరు

గూడూరు పట్టణంలో ప్రైవేటు వ్యక్తుల స్థలంలో పునాదులు తీస్తూ మట్టి పెల్లలు పడి ఇద్దరు భవనిర్మాణ కార్మికులు మంగళవారం చనిపోయారు. స్థానికుల వివరాల ప్రకారం.... గూడూరు పట్టణంలో పునాదులు తీస్తుండగా ప్రమాదవశాత్తు మట్టి పెల్లలు పడ్డాయి. దీంతో ఊపిరాడక కార్మికులు సోమన్న (35), బోయ మధు(25) చనిపోయారు. మట్టి పెల్లలు తొలగించే లోపు వారు విగత జీవు లయ్యారు. సోమన్నకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. బోయ మధుకు భార్య ఉన్నారు. వారిద్దరు భవనిర్మాణ కార్మికులుగా అనేక సంవత్సరాలుగా పనిచేస్తు కుటుంబాలను పోషించుకుంటున్నారు. పోషించే ఇంటి పెద్దలు చనిపోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షలు చెల్లించాలి : సిఐటియు

కర్నూలు కార్పొరేషన్ : గూడూరు నగర పంచాయతీ పరిధిలో ఇంటి పనులు చేస్తూ ప్రమాదంలో మరణించిన భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణ, ఎండి అంజిబాబు గూడూరు మండల కార్యదర్శి జె. మోహన్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గూడూరు నగర పంచాయతీ పరిధిలో ఇంటి నిర్మాణం చేస్తున్న సోమన్న, బోయ మధు ప్రమాదవశాత్తు మరణించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డును అమలు చేసి ఉంటే ఈరోజు వారి కుటుంబానికి సహాయం అంది ఉండేదని అమలు చేయలేకపోవడం వల్ల భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలు నష్టపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరణ చేసి వెల్ఫేర్ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వలన కార్మికులపై భారాలు పడుతున్నాయని, కుటుంబ పోషణ కోసం ఎంత కష్టమైనా ఎన్నో కష్టాలు ఎదుర్కొని భవన నిర్మాణ కార్మికులు ప్రాణాలకు తెగించి కష్టపడే వలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి

- సెట్కూరు సిఇఒ డాక్టర్ కె. వేణుగోపాల్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని సెట్కూరు సిఇఒ డాక్టర్ కె. వేణుగోపాల్ అన్నారు. మంగళవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా డిపార్టుమెంట్ ఆఫ్ యూత్ సర్వీసెస్, సెట్కూర్, కర్నూలు వారి ఆధ్వర్యంలో శ్రీహరి అగ్రికల్చర్ అండ్ పాలిటెక్నిక్ కాలేజ్, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సెట్కూరు సిఇఒ వేణుగోపాల్ మాట్లాడుతూ సౌర శక్తి లాంటి రెన్యువబుల్ ఎనర్జీస్ చాలా ముఖ్యమైనదన్నారు. పర్యావరణం కోసం వాటి మీద అవగాహన అవసరమని తెలిపారు. సౌరశక్తి వినియోగం కోసం ప్రభుత్వం అందించే వివిధ పథకాలను తప్పకుండా ప్రజలు ఉపయోగించుకోవాలని తెలిపారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి బయోడిగ్రేడబుల్ వస్తువుల వాడకాన్ని పెంచాలన్నారు.. అటవీ శాఖ, కర్నూలు వారి తరపున మహమ్మద్ ఇద్రిస్, హెడ్‌ఆఫ్‌వైల్డ్‌లైఫ్ వింగ్, సంఘమిత్ర అనిమల్ ఫౌండేషన్ మాట్లాడుతూ వన్యప్రాణులను సంరక్షించుకోవడం మన బాధ్యత అని, అడవులను వన్యప్రాణులను కాపాడుకోవడం ద్వారా పర్యావరణ సమతుల్యతను సాధించగలుగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్, డిపార్ట్మెంట్ అఫ్ యూత్ సర్వీసెస్ సూపరింటెండెంట్ శ్యామ్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వేణుగోపాల్

తాగునీటి శుద్ధి కేంద్రం మరమ్మతు చేయండి

- ఇబ్బందులు పడుతున్న భవన, ఇతర నిర్మాణ కార్మికులు - పిపిఎస్‌ఎస్ ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరం నడిబొడ్డులో కార్మికులు, ఇతర పేదల కోసం రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధి కేంద్రం మరమ్మతులకు గురై ఏళ్లు గడుస్తున్నా ఏ ఒక్క అధికారి స్పందించలేదని మట్టిపని కార్మికుల మహిళా మేస్త్రి నాగమ్మ, బిఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.యాకోబ్, పట్టణపౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎస్.రమణ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం నగరంలోని ఐదు రోడ్ల కూడలిలో పర్యటించి కార్మికులతో కలిసి తాగునీటి శుద్ధి కేంద్రం ఎదుట పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2013లో సిఐటియు ఒత్తిడి తో పాటు జిల్లా కు చెందిన రాష్ట్ర కార్మిక శాఖ అధికారిగా ఉన్న రామాంజనేయులు(ఐఎఎస్) కృషితో భవన నిర్మాణ కార్మికులు, మట్టి పని కార్మికులు, పాదచారుల కోసం లక్షలు వెచ్చించి నీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. తాగునీటి శుద్ధి కేంద్రం పనిచేయక, నీళ్ల ట్యాంకులు శుభ్రం చేసేవారు లేక అపరి శుభ్రమైన నీళ్లు తాగలేక మండే ఎండలతో వందలాది మంది కార్మికులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. బట్టలు అడ్డం పెట్టుకొని ఆ నీళ్లే తాగుతున్నామని కొందరు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు, కాలువలు, అందమైన భవనాల నిర్మాణాలలో పనిచేస్తున్న కార్మికుల పైన ఎందుకు ఇంత చిన్నచూపు చూస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. వందలాది మంది కార్మికులు పనిచేస్తున్నందున సిమెంట్, స్టీలు, కంకర, ఇసుక పై ప్రభుత్వానికి రూ.కోట్ల ఆదాయం వస్తుందని తెలిపారు. నగరాభివృద్ధికి ఉపయోగపడే కార్మికులకు కనీసం తాగునీరైనా అందించలేకపోవడం క్షమించరాని విషయం అన్నారు. వెంటనే కలెక్టర్ జోక్యం చేసుకొని తాగునీటి శుద్ధి కేంద్రాన్ని మరమ్మతులు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎండి. యూనుస్, సివి.వర్మ, ఎస్.అన్వర్‌బాష, బి.ప్రభాకర్ రెడ్డి, ఎ వెంకటేశ్వర్లు, ఎన్.పీటర్, ఎస్‌కె.ఖాజామొద్దీన్, యు.వెంకటేశ్వర్లు, యు.నరసింహ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు

తహసీల్దార్ ఆఫీస్‌లో చిందర వందరగా విద్యుత్ వైర్లు

- అయోమయంలో సేవల కోసం వస్తూ వెళ్తున్న ప్రజలు

ప్రజాశక్తి - సి బెళగల్ : మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏ గదిలో చూసినా విద్యుత్ వైర్లు వేలాడుతూ చిందర వందరగా దర్శనమిస్తున్నాయి. ఏ వైరు ఏ గదిలోకి సరఫరా అవుతుందో.. ఏ స్విచ్ ఏ లైటుకు ఉందో... ఏ ఫ్యాన్ కు ఉందో అక్కడి సిబ్బందికి తప్ప మరెవరికి తెలియని పరిస్థితి ఉంది. కొన్ని గదులలో అయితే స్విచ్ బోర్డు ఉంటుంది గాని ఒక్క స్విచ్ పని చేయక నామామాత్రంగా దర్శనమిస్తున్నాయి. మరి కొన్ని గదులలో బోర్డు ఉంటుంది గాని స్విచ్ లు లేక అందులోని రంధ్రాలలో వైర్లు మాత్రమే కనిపిస్తాయి. ఇళ్ల ముందు కాలనీళల్లో విద్యుత్ స్తంభాలకు ఎలా వేలాడుతుంటాయో ఆ స్థితిలో ఈ కార్యాలయంలో కనిపిస్తుండటం చర్యలపై మరమ్మతులపై అక్కడి అధికారులకు కనీస దృష్టి లేకపోవడం శోచనీయం. ఇదే కార్యాలయానికి వందలాదిగా ప్రజలు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు వచ్చి వెళ్తున్నారు. వారి పనులు పూర్తి అయ్యాయో లేదో ఇలా చూసి చూడనట్లు వెళ్తున్నారు. కొందరు మాత్రం ఈ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని అధికారులకు, సిబ్బందికి తెలిపినా ప్రాథమిక స్పందన చూపినట్లు లేదని ఇకనైనా తగు మరమ్మతులు చేపట్టి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అనంతయ్య కాంప్లెక్స్ ఎదురుగా సిసి రోడ్డు వేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరంలోని అనంతయ్య కాంప్లెక్స్ ఎదురుగా సిసి రోడ్డును వెంటనే వెయ్యాలని సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్‌ఎండి షరీఫ్, డి.అబ్దుల్‌దేశాయ్ నగరపాలక సంస్థ కమిషనర్‌ను, పాలకమండలిని డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ ఈ రోడ్డు కంకర తేలి ఉండడంతో ఆటో , ద్విచక్ర వాహన చోదకులకు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. తమ గమ్యాలను చేరుకోవడంలో ట్రాఫిక్ వల్ల అంతరాయం ఏర్పడుతుందన్నారు. స్వచ్ఛభారత్ ,స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ ,స్వచ్ఛ కర్నూలు అంటే ఇదేనా అని వారు ప్రశ్నించారు. అతుకుల రోడ్డు ఆ ఇంత ప్రదేశాన్ని దాటిపోవడం గగనం అయిపోయిందన్నారు. యాక్సిడెంట్లు జరిగితే, కాళ్లు చేతులు విరిగిపోయే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే కమిషనర్ రోడ్డును పరిశీలించాలని, ఆ వెంటనే సాంక్షన్ చేయించి సిసి రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అక్కడి ప్రజలను సమీకరించి, పాలకమండలికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన ధర్నా కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా జూటూరు రవి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్ : జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా కర్నూలుకు చెందిన జూటూరు రవి నియమితులయ్యారు. టిడిపి అనుబంధ విభాగమైన తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆయనకు ఈ కమిటీలో సభ్యునిగా చోటు దక్కింది. ఈ మేరకు విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కొత్త కమిటీని ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ , కమిటీ ఛైర్మన్ పి.రంజిత్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త కమిటీ రెండేళ్ల పాటు ఉంటుంది. కమిటీలో స్థానం దక్కించుకున్న జూటూరురవి మాట్లాడుతూ తనపై పెట్టిన నమ్మకాన్ని వొమ్ము చేయకుండా పనిచేస్తానని పేర్కొన్నారు. తనను అన్నివిధాలుగా ప్రోత్సహించిన రాష్ట్ర మంత్రి టిజి భరత్‌కు ఆయన కతజ్ఞతలు తెలిపారు.



మంత్రి టిజి భరత్‌తో జూటూరు రవి

సిఎం చంద్రబాబుతోనే దళితుల అభివృద్ధి

- డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

తెలుగుదేశం పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తోనే దళితుల అభివృద్ధి సాధ్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కూటమి ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణను అమలు చేస్తూ... ఆర్డినెన్స్‌ను జారీ చేయడంతో ఎంఎస్‌పి జిల్లా నాయకులు ఆంధ్రయ్య మాదిగ, కోడుమూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచి భాగ్యరత్న, ఎమ్మిగనూరు టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న, ఎమ్మార్పీఎస్ కోడుమూరు నియోజకవర్గ నాయకులు కె.రాజు మాదిగ, నగేష్ మాదిగ లు ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి ని కలిసి శాలువాతో సన్మానించారు. కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కోట్ల మాట్లాడుతూ...1992 లో ఎస్‌సి వర్గీకరణను డిమాండ్ చేస్తూ.. ఆది జాంబవ అరుంధతి సేవా సంఘం వారు నిజాం కాలేజీ గ్రౌండ్స్‌లో లక్షలాదిమంది మాదిగలతో... నిర్వహించిన బహిరంగ సభకు తన తండ్రి మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై 100కు పైగా ఉప కులాలు ఉన్న బీసీలలో వర్గీకరణ ఉన్నప్పుడు ఎస్‌సి 59 ఉప కులాలలో వర్గీకరణ అవసరమని బలపరిచారని గుర్తు చేశారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన కోనేరు రంగారావును ఉప ముఖ్యమంత్రిగా, ఎమ్మెల్యే మదనగోపాల్‌ను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా నియమించి కోట్ల కుటుంబం మాదిగలకు పెద్దపీట వేసిందని పేర్కొన్నారు. 2000-2004 మధ్య నాలుగేళ్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఎస్సీ వర్గీకరణ అమలు చేసి అట్టడుగు ఎస్సీ ఉపకులాలకు న్యాయం చేసిన ఘనత చంద్రబాబుకు దక్కిందన్నారు. ఎస్సీ వర్గీకరణ పట్ల సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో... రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉండడంతో ఎస్సీ వర్గీకరణ కు మార్గం సుగమం అయిందన్నారు. నాడు నేడు రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన ఏకైక వ్యక్తిగా చంద్రబాబు చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

నగర కమిటీలు అభినందనలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల ఏడవ రాష్ట్ర మహాసభలు ఎన్‌టిఆర్ జిల్లా లో 20, 21వ తేదీల్లో జరిగాయి. ఈ సభలకు 16 జిల్లాల నుండి 150 మంది ప్రతినిధులు హాజరయ్యారు ఈ మహాసభల్లో 41 మందితో తొమ్మిది మంది రాష్ట్ర ఆఫీసు బేరర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కర్నూలు జిల్లా నుండి రాష్ట్రఅధ్యక్షులుగా సి.గురుశేఖర్, రాష్ట్ర కమిటీ సభ్యులుగా ముక్కన్న, శేషాద్రిలను ఎన్నుకోవడం పట్ల కర్నూలు రెండు నగర కమిటీలు అభినందనలు తెలిపారు.

రహదారి నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : నగరంలో 13వ వార్డు బంగారు పేటలో జరుగుతున్న సిసి రహదారి నిర్మాణ పనులను నగరపాలక ఎస్ఇ రాజశేఖర్ సోమవారం పరిశీలించారు. ఆనంద్ థియేటర్ వెనుక భాగంలో కెసి కెనాల్ పక్కన, ప్రధాన రహదారి నుండి కెవిఆర్ కళాశాల సమీపం వరకు రూ.40 లక్షల వ్యయంతో ఈ రహదారి నిర్మాణం చేపట్టారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంఇ సత్యనారాయణ, డిఇఇ క్రిష్ణలత, ట్రైనీ ఎఇ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లెనిన్ జయంతి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్ : ప్రపంచ కార్మిక కర్షక నేత కామ్రేడ్ వ్లాదిమిర్ లెనిన్ చేసిన పోరాటాలు ప్రపంచ కార్మిక పోరాటాలకు గొప్ప స్ఫూర్తి అని సిపిఐ సీనియర్ నాయకుల కె.జగన్నాథం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్.లెనిన్ బాబు,సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప లు కొనియాడారు. మంగళవారం కర్నూలు సిపిఐ కార్యాలయం లెనిన్ జయంతి సందర్భంగా సిపిఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నాగ స్వామి నాయక్‌కు లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ అవార్డు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంస్థ వారు కర్నూలు బి క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ సేవా రంగంలో అందించిన సేవలకు లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ అవార్డును ప్రదానం చేశారు. మంగళవారం ఎస్‌ఎపి క్యాంప్‌లోని సిఆర్‌ఆర్‌ఎం ఉన్నత పాఠశాలలో ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ రాయపాటి శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రిన్సిపల్ లయన్ డాక్టర్ ఎస్. నాగస్వామి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట రెడ్డి, డిఎస్‌పి మహబూబ్ బాష తదితరులు పాల్గొన్నారు. కళాశాల టీచింగ్ , నాన్ టీచింగ్ సిబ్బంది ప్రిన్సిపల్ ను అభినందించారు.

ఇష్టపడి చదవండి: ఎంఇఒ

ప్రజాశక్తి- కోడుమూరు రూరల్ : చదువును కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే మంచి మార్కులు ర్యాంక్ లు వస్తాయని మండల విద్యాధికారి 2 తైమూర్ బాష అన్నారు. మంగళవారం పట్టణంలోని న్యూ విశ్వ వాణి ఇంగ్లీష్ మీడియం హైస్కూలులో జరిగిన అకాడమీ ర్యాంక్‌లకార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏ రంగంలో నైనా రాణించాలంటే వాటిపై ఇష్టం పెంచుకోవాలన్నారు. చదువు పై ఇష్టం పెంచుకుంటే తలెత్తేలా ముందుకు సాగుతారాన్నారు. విద్యాసంవత్సరం చివరిలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం వల్ల విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత బయటకు తీయొచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు ర్యాంక్‌లను ఆయన ప్రదానం చేశారు. అనంతరం డాక్టర్ గౌతమ్ మాట్లాడుతూ చిన్నతనం నుంచి చదువుపై ఇష్టం పెంచుకోవాలాన్నారు. ప్రతి సంవత్సరం స్కూల్ మేనేజ్‌మెంట్ వారు ఇలాంటి కార్యక్రమాలు చేయడంతో విద్యార్థుల్లో పోటీ తత్వం పెరుగుందన్నారు. స్కూల్ మేనేజ్మెంట్ ఖలీల్, గిడ్డయ్య, శ్రీనివాసులు ఉపాధ్యాయులు రబియా, కల్పన, హరిత, భాగ్యలక్ష్మి, భారతి, రెహానాలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోషణ పక్వాడ పై అవగాహన

ప్రజాశక్తి పత్తికొండ : పౌష్టిక ఆహారంతోనే గర్భిణీలు ,బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని పత్తికొండ సిడిపిఒ లలిత పేర్కొన్నారు. మంగళవారం పత్తికొండ ఐసిడిసి కార్యాలయంలో అంగన్వాడి టీచర్లకు పోషణ పక్వాడా పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సిడిపిఒ లలిత, పత్తికొండ ఎఎస్ఐ పౌష్టికాహారం స్టాల్‌ను సందర్శించారు. వారు మాట్లాడుతూ పోషణ్ పక్వాడ ఏప్రిల్ 8 నుండి 22 వరకు వారోత్సవాలు జరుపుకోవాలన్నారు సూపర్వైజర్లు త్రివేణి, అంబిక, నాగేశ్వరమ్మ, సుభద్రమ్మ అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భాస్కర్

మొక్కలు నాటి సంరక్షించాలి

- ప్రధానోపాధ్యాయులు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్

ప్రజాశక్తి-పత్తికొండ : ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని, అప్పుడే ఈ భూమ్మీద ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని ప్రధానోపాధ్యాయులు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి భాస్కర్, యువ స్పందన సొసైటీ ఉపాధ్యక్షులు లక్ష్మన్న తెలిపారు. మంగళవారం పత్తికొండ మండల పరిధిలోని దూదెకొండ గ్రామంలో ఉన్న ఎంపిపి స్కూలులో యువ స్పందన సొసైటీ ఆధ్వర్యంలో ధరిత్రీ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాట్లాడుతూ.... ప్రస్తుతం భూమ్మీద ప్లాస్టిక్ , వాహనాల కాలుష్యం వల్ల భూమి వేడెక్కి వాతావరణంలో మార్పులు వస్తున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి మొక్కలను పెంచాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణుడు, హుస్సేన్, శంకరప్ప, రహీం, యువ స్పందన సహాయ కార్యదర్శి గిరీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

25న ఎస్‌ఎఫ్‌ఐ ఆన్‌లైన్ మోడల్ ఎంసెట్ పరీక్ష

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈనెల 25న ఆన్‌లైన్ మోడల్ ఎంసెట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ కర్నూలు నగర కార్యదర్శి సాయి ఉదయ్, నగర్ ఉపాధ్యక్షులు ఆర్యన్, పృథ్వి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించే మోడల్ ఎంసెట్ పరీక్ష ఏప్రిల్ 25న పుల్లయ్య ఇంజనీరింగ్ కాలేజీలో ఉంటుందన్నారు. మోడల్ ఎంసెట్ ఎగ్జామ్ నిర్వహించడం ద్వారా విద్యార్థులను చైతన్యం చేసి వారు అనుకున్నటువంటి లక్ష్యానికి దగ్గర చేయడమే ఎస్‌ఎఫ్‌ఐ సంకల్పమన్నారు. మోడల్ ఎంసెట్ పరీక్ష ప్రశ్నల తయారీ విధానాన్ని అనుభవజ్ఞులైన మేధావులతో తయారు చేయించి విద్యార్థుల్లో అవగాహన తీసుకురావడం కోసం నిర్వహిస్తున్నామన్నారు. ఈ మోడల్ ఎంసెట్ పరీక్ష రాయడం ద్వారా విద్యార్థులు ప్రశాంతంగా తమ లక్ష్యాన్ని చేరుకునే చివరి పరీక్షను రాయడానికి ఉపయోగపడుతుందన్నారు.

అన్న క్యాంటీన్ల వద్ద రిశుభ్రంగా ఉండాలి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్ : నగరంలోని అన్న క్యాంటీన్ల వద్ద పరిశుభ్ర వాతావరణంలో ఉండాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన పాత బస్టాండ్‌లోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ.. అన్న క్యాంటీన్‌లలో తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. మెనూ ప్రకారం ప్రకారం భోజనం అందించాలని, అన్న క్యాంటీన్‌లను పర్యవేక్షించేందుకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించామని పేర్కొన్నారు. అంతకన్నా ముందు ఆయన ఛత్రీబాగ్, పాతబస్తీ, ఎన్‌ఆర్ పేట, తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు.

సునిత నర్సింగ్ హోంపై చర్యలు తీసుకోండి

- డాక్టర్ నిర్లక్ష్యానికి ప్రాణాలు పోతున్నాయి
-మొదట డబ్బుతీసుకుని, తర్వాత చేతులెత్తేయడం
- కలెక్టర్, వైద్యాధికారులకు ఫిర్యాదు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



వైద్యో నారాయణ హరి అంటారు. వైద్యులు ఎంతో ముఖ్యమైన వారు. అత్యవసర వైద్య సేవలను ఆసరాగా చేసుకుని కొందరు వైద్యులు డబ్బే పరమావధిగా, మానవత్వం మరిచి ప్రవర్తిస్తున్నారు. డబ్బు ముడితే చాలు, తర్వాత సంగతి దేవుడికెరుక అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని బాధితురాలు ఎంఎన్. ప్రియాంక, ఆమె భర్త ప్రకాశం ఆరోపించారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ, ఎమ్మిగనూరు పట్టణంలోని సునీత నర్సింగ్ హోంలో ఇలాంటి సంఘటన జరిగిందని తెలిపారు. వారి వివరాల ప్రకారం...బాధితురాలు ఎంఎన్. ప్రియాంక తొమ్మిది నెలల గర్భవతి. ప్రారంభం నుండి అదే నర్సింగ్ హోంలో వైద్యం చేయించుకుంటున్నారను. ఎప్పటికప్పుడు అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. నెలలు నిండిన తర్వాత, మార్చి 29న ఆమె చూపించుకున్న సునీత నర్సింగ్ హోంకు వెళ్లి ఆరోగ్య పరిస్థితి వివరించి డాక్టర్‌ను కలవాలని సిబ్బందిని కోరారు. డాక్టర్ ఆ రోజు రారని, అష్టమి ఉండటం వల్ల మేడమ్ రారని నిర్లక్ష్యంగా చెప్పారు. తర్వాత రోజు డాక్టర్ వచ్చి మధ్యాహ్నం పన్నెండు గంటలకు అన్ని వైద్య పరీక్షలు చేసి, గర్భంలోనే బిడ్డ చనిపోయాడని చెప్పారు. తర్వాత డాక్టర్ సునీత సిఫార్సుతో కర్నూలులోని అశ్విని హాస్పిటల్‌కు పంపారు. తమ బిడ్డ మృతికి కారణమైన డాక్టర్ సునీతపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డాక్టర్‌పై చర్యలు తీసుకుని కేసు నమోదు చేయాలి: ఎంఎన్.ప్రకియాంక



తాను క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకున్నాను. చివరి దశలో వైద్యం చేయడంలో నిర్లక్ష్యం వహించి బిడ్డ మృతికి కారణమైన డాక్టర్ సునీతపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఈ విషయంలో జిల్లా కలెక్టర్‌ను, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తాం.

పేషెంట్ పట్ల నిర్లక్ష్యం వహించలేదు - డాక్టర్ సునీత:

పేషెంట్ ప్రియాంక పట్ల తమ సిబ్బంది కానీ, తాను కానీ నిర్లక్ష్యం వహించలేదు. మొదటి నుండి ఆమెకు బిపి ఉండటంతో తొమ్మిదో నెల రాగానే జాగ్రత్తలు తీసుకోమని సూచనలు చేశాం. ఆమె మార్చి 29న మధ్యాహ్నం వరకు తన ఆసుపత్రికి వచ్చిన వారికి వైద్యం అందించాం.. తర్వాత కర్నూలుకు వెళ్లానని చెప్పాం. రాత్రి తన సిబ్బందిని విచారించగా ఫోన్ ద్వారా సంప్రదించాలని చెప్పారు. 30న ఉదయం తమ సిబ్బంది ఫోన్ చేసి వారిని ఆసుపత్రికి రమ్మన్న తర్వాతే వచ్చారు. అప్పటికే గర్భంలో బిడ్డ కదలికలు లేకపోవడంతో కర్నూలుకు రెఫర్ చేశాం.

లారీ ఢీకొని తండ్రీకూతురు దుర్మరణం

- సెలవులకు కుమార్తెను ఇంటికి తీసుకువస్తుండగా ఘటన

ప్రజాశక్తి - ఆస్పరి/ ఆలూరు

వేసవి సెలవులు వదిలిన ఆనందంలో తండ్రితో కలిసి స్వగ్రామానికి వస్తున్న ఆ కళలు ఆవిరయ్యాయి. లారీ ఢీకొని తండ్రీకూతురు దుర్మరణం చెందిన ఘటన ఆలూరు మండలం పెద్దహోతూరు వద్ద మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు ఆస్పరి మండలం ముత్తుకూరు గ్రామానికి చెందిన వడ్డే ఈరన్న(46) కుమార్తె వడ్డే శ్రావణి (14) చిప్పగిరిలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. వేసవి సెలవులు కావడంతో ఇద్దరూ మోటార్ బైక్‌పై స్వగ్రామానికి వస్తున్నారు. ఆలూరు పట్టణం దాటిన తర్వాత నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్ద హోతూరు గ్రామం వద్ద ఎదురుగా వచ్చిన లారీ మోటర్ సైకిల్ ను ఢీకొంది. ఈ ప్రమాదంలో వడ్డే ఈరన్న, కూతురు శ్రావణి అక్కడికక్కడే మృతి చెందారు. వేసవి సెలవులలో సరదాగా ఇంటి వద్ద గడపదామని అనుకున్న శ్రావణి అకాల మరణం పలువురిని కంటి తడి పెట్టింది. ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి చెందడంతో ముత్తుకూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. డ్డే ఈరన్నకు భార్య రాధా, ముగ్గురు కూతుర్లు, క కొడుకు ఉన్నారు. ఇంటికి పెద్ద దిక్కున కోల్పోవడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు పలువురిని చలించి వేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న చిప్పగిరి కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపల్ సౌజన్య, కేజీబీవీ సిబ్బంది, తోటి విద్యార్థినీలు కన్నీరు మున్నీరుగా విలపించాఇరు.


రోడ్డు ప్రమాదంలో చనిపోయిన తండ్రి, ఇన్‌సెట్‌లో కూతురు శ్రావణి

రజకుల ఆర్థిక బలోపేతానికి చేయూతనివ్వాలి

ప్రజాశక్తి - ఆదోని



సామాజికంగా ఆర్థికంగా రజకులు వెనుకబడి ఉన్నారని బలోపేతం చేసేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించి ఆదుకోవాలని ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తామని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముక్కన తెలిపారు. మంగళవారం ఆయన ఆదోనిలో విలేకరులతో మాట్లాడారు రజక వృత్తిదారుల సంఘం ఏడవ రాష్ట్ర మహాసభ విజయవాడలోనే ఇబ్రహీంపట్నం ముత్తవరపు వెంకటేశ్వర స్వామి స్వర్ణ దేవి కళ్యాణ మండపంలో జరిగిందన్నారు. ఈ సమావేశంలో 14 అంశాలను తీర్మానం పెట్టామన్నారు. రాష్ట్ర కార్యవర్గంలో కర్నూలు వాసులకు చోటు దక్కిందన్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా గురు శేఖర్, కార్యవర్గ సభ్యులుగా శేషాద్రి, ముక్కన్నలకు అవకాశం కల్పించారన్నారు. గత ఎన్నికలకు ముందు రజకుల సంక్షేమానికి పాటుపడతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రజకులను మరచిందన్నారు. ఎస్సీ, ఎస్టీ తరహాలోనే సామాజిక రక్షణ చట్టం రజకులకు తీసుకురావాలన్నారు. 50 ఏళ్ళు వయసు నిండిన వారందరికీ పింఛన్ల సదుపాయం కల్పించాలన్నారు.

విరమణ ప్రతి ఉద్యోగికి సహజం

- టిడిపి యువ నాయకులు రామకృష్ణా రెడ్డి

ప్రజాశక్తి మంత్రాలయం



ఉద్యోగ విరమణ ప్రతి ఉద్యోగికి సహజమని మంత్రాలయం నియోజకవర్గం టిడిపి యువ నాయకులు ఎన్ రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఇంగ్లీష్ ఉపాధ్యాయునిగా పని చేస్తున్న సాతర్ల రామాంజనేయులుఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని విద్యార్థులను దేశ పౌరులుగా తీర్చిదిద్దడంలో వృత్తి ఎంతో కీలకమైంది అన్నారు. రామాంజనేయులుకు ఆయన సతీమణికి శాలువా కప్పి పూలమాల వేసి, సత్కరించారు. ఎంఈఓ-2 రాగన్న , ఖాజామోహినుద్దీన్, హెచ్ఎం భోజరాజు , ఉపాధ్యాయులు వేరు వేరుగా రామాంజనేయులును సత్కరించారు. సూగురు హెచ్ఎం లచ్చప్ప, ఉపాధ్యాయులు రవీంద్ర రాఘవన్ , రాజశేఖర్ పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలు లేక


-నిలిచిపోయిన పంట ఉత్పత్తులు
- కొనుగోలు చేయకపోవడంతో ఆందోళనలో రైతులు
- పొలాల్లో నిలువ ఉన్న పంట ఉత్పత్తులు

ప్రజాశక్తి- దేవనకొండ

ప్రకృపరీత్యాలు, పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించక ప్రతి ఏడాది రైతులు ఏదో రకంగా నష్టాలను మూటగట్టుకొని అప్పుల ఊబిలో కురుకుపోతున్నారు. పంట మార్పిడి ద్వారా కొత్త రకం పంటలను సాగు చేయాలన్న రైతుల ఆలోచనకు గడ్డు పరిస్థితులు పడుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో మండలంలో రైతులు పొగాకు పంట 450 ఎకరాలలో సాగు చేశారు. జి బి ఐ కంపెనీకి చెందిన వ్యాపారస్తులు క్వింటాం పొగాకు రూ.15వేల ప్రకారం కొనుగోలు చేస్తామని పంట సాగును రైతులతో చేయించారు. గత ఏడాది ఆశించిన స్థాయిలో పొగాకు పంట ఉత్పత్తులు మార్కెట్లో అమ్ముడుపోయాయని ఈ ఏడాది కూడా అదే రీతిలో వస్తాయని ఆశించిన రైతుల ఆశలు అడియాశలు అయ్యాయి. ఒక ఎకరా పంట సాగుకు రూ.50 వేల దాకా పెట్టుబడి వస్తుందని, 8 క్వింటాలు దాకా పంట దిగుబడి వస్తుందని రైతులు ఆశతో సాగు చేశారు. అయితే మార్కెట్ స్థాయిలో పొగాకు పంటను కొనుగోలు చేయకపోవడంతో రైతుల దగ్గర నుండి జీబీఐ కంపెనీ వారు కొనుగోలు నిలుపుదల చేశారు. దీంతో పంట ఉత్పత్తులు పొలాల్లోనే నిలువగా ఉన్నాయని రైతులు వాపోతున్నారు. పొగాకు రైతులు ప్రస్తుతం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ప్రారంభంలో కొంతమేరకు కంపెనీవారు పంటను కొనుగోలు చేశారని గత రెండు నెలలుగా మార్కెట్లో ధరలు లేవని చెప్పి కొనుగోళ్లు నిలుపుదల చేశారు. జిబిఐ కంపెనీ వారు రైతులను నమ్మించి మోసం చేశారని, పొగాకు రైతులను అన్ని రకాలుగా ఆదుకుంటామని కంపెనీవారు నమ్మించి పొగాకు పంటను రైతులతో సాగు చేయించారని పలువురు రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొగాకు రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా పొగాకు రైతులకు మద్దతు ధర కల్పించి కంపెనీ వారితో కొనుగోలు చేయించాలని కోరుతున్నారు.


పొలాల్లో నిలువ ఉన్న పొగాకు ఉత్పత్తులు

జిబిఐ కంపెనీ వారు నమ్మించి మోసం చేశారు
- వెంకటేష్, రైతు



ఉన్న మూడు ఎకరాల్లో పొగాకు పంటను సాగు చేశాను. క్వింట రూ.15000 మద్దతు ధర ఇస్తామని చెప్పి ప్రారంభంలో ఎకరాకు మూడు కింటాలు ప్రకారం కొనుగోలు చేశారు. గిట్టుబాటు ధర లేదని చెప్పి కొనుగోలు చేయకపోవడంతో పంట ఉత్పత్తులు పొలంలోని నిల్వ ఉన్నాయి. ఇంకా 20 క్వింటాల దాకా పంట ఉత్పత్తులు పొలంలోనే నిల్వ ఉన్నాయి.

పెట్టుబడులు కూడా రాలేదు
- రాజశేఖర్ రైతు



నాకున్న 9 ఎకరాల పొలంలో పొగాకు పంటను సాగు చేశాను. పంట ఉత్పత్తులు కొనుగోలు చేయకపోవడంతో పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదు. జిబిఐ కంపెనీ రైతులతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఉత్పత్తులను కొనుగోలు చేయాలి. అలాకాక మార్కెట్లో గిట్టుబాటు ధర లేదని పంట కొనుగోలు చేయడం నిలిపివేయడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంట ఉత్పత్తులను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

మెరుగైన విద్యకు మారుపేరు పద్మావతి ఒకేషనల్ కాలేజ్

ప్రజాశక్తి - ఆదోని

వృత్తివిద్య కోర్సుల్లో మెరుగైన విద్యకు మారుపేరుగా పద్మావతి ఒకేషనల్ కళాశాల పేరుందని కళాశాల కరస్పాండెంట్ విరుపాక్షి పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన ఒకేషనల్ ఫలితాలలో అరుదైన ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు విజయకేతనం చూపారు కళాశాల కరస్పాండెంట్ విరుపాక్షి మాట్లాడారు. తమ కళాశాలలో ఎంపిహెచ్ డబ్ల్యు (ఫిమేల్)మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, ఈటి కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. విశాలమైన గదులు అనుభవ జ్ఞాలైన ట్యూటర్ల చేత బోధన అందించడం జరుగుతుందన్నారు ఎప్పటికప్పుడు ల్యాబ్ పరీక్షలు నిర్వహిస్తూనే విద్యార్థులకు ఆ ఫ్రెండ్షిప్ సదుపాయం కూడా కల్పిస్తున్నామన్నారు. ఇక్కడ చదివిన విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులలో ఉద్యోగాలు పొంది ఆకర్షణీయమైన వేతనాలు పొందుతున్నారన్నారు. ఇటీవల విడుదలైన ఒకేషనల్ ఫలితాలలో ల్యాబ్ టెక్నీషియన్‌లో సాయి వైష్ణవి 918, కే శ్రీరాములు 983, ఎంపిహెచ్ డబ్ల్యు (ఫిమేల్)లో కవిత 894 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారన్నారు. మిగతా విద్యార్థులు 800పైగా మార్కులు సాధించి ప్రతిభ చూపారన్నారు. మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సులో మొదటి సంవత్సరం ఫలితాలలో వీరన్న 461, అక్షిత 458, సంధ్య 457 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారన్నారు. మిగతా విద్యార్థులు 400 పైగా మార్కులు సాధించి ప్రతిభ చాటారన్నారు టెన్త్ పాస్ ఇంటర్ పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ కోర్సులకు అర్హులు అన్నారు. మరిన్ని వివరాల కోసము ప్రభుత్వ బాలికల కళాశాల సమీపంలోనే పద్మావతి ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపల్ రామలింగారెడ్డి 9014066760, రాంప్రసాద్ రెడ్డి 9440420785 లను సంప్రదించాలని కోరారు.



అక్కడ బిజెపి ఇక్కడ వైసిపి అంటున్న శశికళ

ప్రజాశక్తి - ఆదోని

కురువలకు అండగా ఉంటామని లేనిపోని ఆశలు కల్పించి మోసం చేసిన ఘనత వైసిపి మహిళ అధ్యక్షురాలు శశికళకే దక్కిందని కురుబ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప విమర్శించారు. మంగళవారం అదోనిలో ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ రామకష్ణ ,ఎండి హళ్లి సర్పంచ్ సుధాకర్ తో కలిసి మాట్లాడారు ఈ ఏడాది జనవరి 24న ఆలూరు మండలం అరికెరలో బండారి ఈరన్న హత్యకు గురయ్యారు అన్నారు. కురుబ సామాజిక వర్గం చెందిన వారు కావడంతో ఎంపీ బస్తి పాటి నాగరాజు తో కలిసి పరామర్శించి ఆర్థిక సాయం చేశామన్నారు. మతుడు భార్యకు ప్రభుత్వ శాఖల్లో ఆయా, ఆశా వర్కర్ పోస్ట్ ఇప్పిస్తామని హామీ ఇచ్చామన్నారు ఆమె చదువు లేకపోవడం వల్ల ఉద్యోగం రాలేని పరిస్థితి అన్నారు. తాము ఏదో విధంగా ప్రయత్నం చేసిన వైసీపీ నాయకులే అడ్డుకున్నారని గుర్తు చేశారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఎంపీ బస్తిపాటి నాగరాజు పై వైసీపీ మహిళ జిల్లా అధ్యక్షురాలు శశికళ ఆరోపణలు చేయడం తగదన్నారు హత్య రాజకీయాలు అంటూ సంబోధించడం సరికాదన్నారు. హత్య రాజకీయాలు వైసిపి నైజం అన్నారు కురువలకు అండగా ఉంటామని ఎస్సీ సర్టిఫికెట్ ఇప్పిస్తామని రెండు ఎకరాల భూమి కొని ఆసుపత్రి కట్టిస్తామని ఆశలు కల్పించి మోసం చేసిన నైజం శశికళదే అంటూ మండిపడ్డారు. సమావేశంలో ఆలూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ జయరాం, కర్నూల్ జిల్లా బిఎస్ఎన్ అడ్వైజారి కమిటీ మెంబెర్ మల్లికార్జున, టీడీపీ హాలహర్వి మండల నాయకులు తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.


సమావేశం లో మాట్లాడుతున్న మాన్వి దేవేంద్రప్ప

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ఆస్పరి



మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని బుధ వారం ఎంపీపీ సుకర ఉమాదేవి అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో గీత వాణి తెలిపారు. మంగళ వారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని 33 గ్రామాలలో నెలకొన్న డ్రైనేజీ, మంచినీటి సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. జడ్పీటీసీ, ఎంపిటిఒసిలు, సర్పం చులు, మండల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.



ఎండలు భగభగ.. మూగ జీవాలు విలవిల..!

ప్రజాశక్తి కౌతాళం

రోజు రోజుకు ఎండలు భగభగమంటున్నాయి. ఉదయం 9 గంటల నుండి వేడి గాలులు వీస్తున్నాయి. ఈ వడగాలులు దెబ్బకు ప్రయాణాలు తగ్గించుకుని ఇంటికి పరుగులు తీస్తున్నారు. ప్రజల పరిస్థితి ఇలా ఉంటే, మూగజీవాలైన మేత కోసం వెళ్లిన ఆవులు దూడలు ఎద్దులు గేదెలు కూడా చెట్టు నీడ ఎక్కడ కనిపిస్తుంది అని పరుగులు చేస్తున్నాయి. ఇలాంటి సంఘటన అడవులలో పశువులు ఎదుర్కొంటున్నాయి. ఎండ దెబ్బకు చెట్టు కింద పశువులు చేరిన దృశ్యం ప్రజాశక్తికి కనపడింది.

నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు

- పట్టుబడిన 65 లీటర్ల నాటుసారా- 1350 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం కర్నూలు నగరంలోని బంగారుపేటలో నాటుసారా స్థావరాల పై కర్నూలు రెండవ పట్టణ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు సమన్వయంతో దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, ఎక్సైజ్ సూపరింటెండ్ సుధీర్ బాబు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండ్లు రాజశేఖర్ గౌడ్, రామకష్ణరెడ్డి, కర్నూలు పట్టణ సిఐలు నాగరాజారావు, మన్సురుద్దీన్, నాగశేఖర్ ఎక్సైజ్ సిఐలు చంద్రహాస్, జయరాం నాయుడు, క్రిష్ణ, 5 బందాలుగా ఏర్పడి దాడులు చేశారు. ఈ దాడులలో 65 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోగా, 1350 లీటర్ల నాటు సారా బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవోదయం కార్యక్రమంలో భాగంగా నాటు సారా నిర్మూలన ఆవశ్యకత గురించి, నాటు సారా అనర్థాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే నాటుసారా జోలికి వెల్లరాదని సూచంచారు. నాటుసారా తయారి, విక్రయాలు ఇక నుండి మానుకోవాలని జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి ఎం సుధీర్ బాబు బంగారు పేట వాసులను హెచ్చరించారు.

రాజ్యాంగాన్ని, ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుందాం

-మనువాదాన్ని తరిమికొట్టాలి - అంబేద్కర్ స్ఫూర్తితో నవభారతం నిర్మించాలి
- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంద్రమాల్యాద్రి
-జనహృద్యంగా 'సంఘం శరణం గచ్ఛామి' నాటకం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో రాజ్యాంగాన్ని, ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంద్రమాల్యాద్రి, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు జి. రామన్న పిలుపునిచ్చారు. మంగళవారం కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో కెవిపిఎస్, డివైఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారు అంబేద్కర్ జీవిత చరిత్రకు సంబంధించిన 'సంఘం శరణం గచ్ఛామి' నాటకాన్ని ప్రదర్శించారు. వేలాదిగా తరలివచ్చిన గ్రామ ప్రజలు ఈ ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. నాటకంలోని కళాకారులు ప్రదర్శించిన వివిధ సన్నివేశాలు ప్రేక్షకులను అలరించాయి. అంబేద్కర్ జీవితంలో ఆయన ఎదుర్కొన్న అవమానాలు, వాటిని ధైర్యంగా ఎదుర్కొని పోరాడిన తీరు ప్రజల్లో చైతన్యాన్ని నింపింది. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభలో ఆంద్ర మల్యాద్రి మాట్లాడుతూ, ప్రపంచ దేశాలు అంబేద్కర్ ప్రతిభను, ఆయనకున్న గౌరవాన్ని గుర్తిస్తుంటే, సొంత దేశంలో ఆ గుర్తింపు కరువవడం విచారకరమన్నారు. దేశంలో ఆయనకు, ఆయన రచించిన రాజ్యాంగానికి ప్రతి అడుగునా అవమానాలు, అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం తనను ప్రధానమంత్రిని చేస్తే, దేశంలో మనువాదం తాను ఒక మహిళనని కూడా చూడకుండా అవమానించిందని మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చెప్పిన మాటలను ఆయన గుర్తు చేశారు. అంబేద్కర్ దేశంలో కుల నిర్మూలన జరగాలని, దున్నేవాడికే భూమి చెందాలని బలంగా కోరుకున్నారని, దాని కోసం పోరాడారని తెలిపారు. కానీ నేటి పాలకులు రైతుల భూములను కార్పొరేట్లకు అప్పనంగా అప్పగించే కుట్ర చేస్తున్నారని ఆయన అన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో నవభారతాన్ని నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు. జి. రామన్న మాట్లాడుతూ, దేశంలో రాజ్యాంగాన్ని మార్చి మనువాద రాజ్యాంగాన్ని స్థాపించాలని కొన్ని మతోన్మాద శక్తులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో అసమానతలు, కుల మత భేదాలు లేని రాజ్యం కావాలని, సంపద అందరికీ సమానంగా పంచాలని అంబేద్కర్ ఆకాంక్షించారని ఆయన అన్నారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు మాట్లాడుతూ, సాంకేతిక యుగంలోనూ అంటరానితనం కొనసాగడం బాధాకరమన్నారు. నేటికీ జిల్లాలో అనేక రూపాల్లో వివక్షత ఉందని ఆయన తెలిపారు. నాడు మనువాదులు సమాజాన్ని విభజించేందుకు జాతరవావరణ వ్యవస్థను అమలు చేశారని ఆయన విమర్శించారు. అంబేద్కర్ పీడిత జాతులు, అస్పృశ్యత, ఆర్థిక అసమానతలను దృష్టిలో ఉంచుకుని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీలుగా గుర్తింపులు తీసుకొచ్చారని, ఆయా వర్గాలకు కేటాయించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన అన్నారు. దీన్ని అడ్డుపెట్టుకుని పాలకులు కులాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందుతున్నారని ఆయన అన్నారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.రాఘవేంద్ర అధ్యక్షత వహించగా, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అబ్దుల్లా, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కరుణాకర్, మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, గ్రామ కార్యదర్శి విక్రమ్, ఉపాధ్యక్షులు లక్ష్మప్ప, డివైఎఫ్ఐ నాయకులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


'సంఘం శరణం గచ్ఛామి' నాటకంలో ఓ సన్నివేశం


అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న మాల్యాద్రి , తదితరులు

రోడ్డు పాలు అవుతున్న తాగునీరు

స్పందిచని కార్పోరేషన్ అధికారులు, ప్రజా ప్రతినిదులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : కర్నూలు కార్పొరేషన్ పరిదిలోని 37 వ వార్డు వీకర్ సెక్షన్ కాలనీ సెంటర్ లో వారం రోజులుగా వృధాగా రోడ్డు పాలవుతున్న తాగునీటి ని పరిశీలించేందుకు సిపిఎం బృందం నగర కార్యదర్శి టి. రాముడు పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు యన్. అలివేలు, పార్టీ వార్డు కార్యదర్శి ఎస్ .శ్యామల, పి.అబ్దుల్ రెహమాన్. ఎస్. సత్యం, ఎం. జమ్మన్న. గుర్రప్ప స్థానిక వార్డు కార్యకర్తలతో కలిసి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత వారం రోజులుగా నడిరోడ్డులో తాగునీరు వృధాగా పోతునన్నా కార్పోరేషన్ అధికారులు గానీ, స్థానిక కార్పొరేటర్ గానీ ప్రజాప్రతినిధులు గాని ఏమాత్రం స్పందించకపోవడం చాలా విచారకరమని అన్నారు. వీకర్ సెక్షన్ కాలనీ ఓవర్ హెడ్ ట్యాంక్ నుండి రాజీవ్ గహకల్ప, డ్రైవర్స్ కాలనీ పెద్దపాడు చుట్టుపక్కల కాలనీల ప్రజలకు తాగునీటి అవసరాల కోసం గత 20 సంవత్సరాల కిందట వేసిన పైప్ లైన్ తరచూ పగిలిపోయి తాగునీరు వృధా అవుతున్న సమస్య శాశ్వత పరిష్కారం కోసం కొత్త పైప్ లైన్లు వేయాలన్న ఆలోచన రాకపోవడం పేద మధ్యతరగతి ప్రజల తాగునీటి సమస్యతీర్చే విషయంలో అధికారులకు ప్రజాప్రతినిధులకు ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందని అన్నారు. ప్రజలు వేసవికాలంలో త్రాగునీరు దొరకక అల్లాడిపోతుంటే మరోపక్క ఇలా వృధా అవుతున్న నీటిని అరికట్టేందుకు స్పందించని కార్పొరేషన్ అధికారులను ప్రజలు ప్రశ్నిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదికన కొత్త పైప్ లైన్ నిర్మాణం చేపట్టి రోడ్డు పాలవుతున్న నీటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజలను సమీకరించి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు,


రోడ్డు పాలవుతున్న నీటిని చూపుతున్న సిపిఎం నాయకులు రాముడు, తదితరులు


రేషన్‌కు ఈ కేవైసీ తప్పనిసరి

- తహశీల్దార్ నిజాముద్దీన్

ప్రజాశక్తి - హోళగుంద



ఈ కేవైసీ పూర్తికాని రేషన్ కార్డుదారులు తప్పనిసరిగా ఈనెల 30లోగా ఈ కేవైసీ చేయించుకోవాలని తహసిల్దార్ నిజాముద్దీన్ రేషన్ కార్డుదారులను కోరారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ కేవైసీ పూర్తి కాకుంటే ప్రతి నెల ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రేషన్ బియ్యం కంది బేడలు, చక్కర, జొన్నలు తదితర సరుకులు పొందుటకు అన్వారులుగా పేర్కొంటూ ప్రభుత్వం మీ రేషన్ నిలుపుదల చేసే అవకాశాలు ఉన్నాయని, ఈ కేవైసీ చేయించుకోలేదంటే మీరు లేనట్లే భావించవలసి వస్తుందని గుర్తు చేశారు. మండలంలో 17,102 రేషన్ కార్డులు ఉన్నాయని, రేషన్ కార్డులో కుటుంబ సభ్యులు 57,443 ఉన్నారని ఈ కేవైసీ పూర్తయిన వారు 49,411 మంది ఉండగా ఈ కేవైసీ పెండింగ్ లో ఉన్న కార్డుదారులు 8,032 మంది ఉన్నారని గుర్తు చేశారు ఇందులో ఐదు సంవత్సరాల లోపల ఉన్న వారికి ఈకే వయసు అవసరం ఉండదు అన్నారు 8032 మంది కార్డుదారులు మాత్రం తప్పక ఈ కేవైసీ చేయించుకోవాలన్నారు ఈ అవకాశాన్ని కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.


రైతులకు స్పేర్ పంపులు అందజేస్తున్న రాంఘవేంద్రరెడ్డి

రైతు అభివృద్ధి కోరే ప్రభుత్వం

ప్రజాశక్తి-కోసిగి

రైతు అభివృద్ధి కోరే ఏకైక ప్రభుత్వం టిడిపి అని , చంద్రబాబు నాయుడు అధికారంలో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందుతారని , రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని మంత్రాలయం టిడిపి ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో టిడిపి మండల అధ్యక్షులు జ్ఞానేష్ , ఎడిఎలు బాలవర్ధిరాజు , మహమ్మద్ ఖాద్రిల అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. టిడిపి ఇన్చార్జ్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం తూతూమంత్రంగా చిన్న చిన్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందించి , పెద్దపెద్ద సంక్షేమ పథకాలు ,అవినీతి డబ్బులతో నాయకులు జేబులు నింపుకున్నారన్నారు. రైతు అభివృద్ధి కోరే , ప్రభుత్వం అంటేనే టిడిపి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని కౌతాళం , కోసిగి , మంత్రాలయం , పెద్దకడబూరు మండలాల్లో ఉన్న రైతులకు రోటో వెయిటర్స్ , టిల్లర్స్ , స్పేర్స్ , గన్ పంప్స్ వంటివి దాదాపు రూ.43 లక్షల సబ్సిడీ రూపంలో పనిముట్లు మంజూరయ్యాయన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని పథకాలతో కూటమి ప్రభుత్వం ప్రజల మన్ననలలు అందు కుంటుందన్నారు. టిడిపి నాయకులు ముత్తురెడ్డిరామిరెడ్డి , వక్రాని వెంకటేశ్వర్లు , రమాకాంత్ రెడ్డి, అయ్యన్న, బిజెపి నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి , బిజెపి రాముడు , వ్యవసాయ అధికారులు రాజు , శేషాద్రి వరప్రసాద్ , జీరా గణేష్ మరియు ఆయా మండలాల కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

'సంఘం శరణం గచ్ఛామి' నాటకం దృశ్య మాలిక

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో రాజ్యాంగాన్ని, ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంద్రమాల్యాద్రి, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు జి. రామన్న పిలుపునిచ్చారు. మంగళవారం కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో కెవిపిఎస్, డివైఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారు అంబేద్కర్ జీవిత చరిత్రకు సంబంధించిన 'సంఘం శరణం గచ్ఛామి' నాటకాన్ని ప్రదర్శించారు. వేలాదిగా తరలివచ్చిన గ్రామ ప్రజలు ఈ ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. నాటకంలోని కళాకారులు ప్రదర్శించిన వివిధ సన్నివేశాలు ప్రేక్షకులను అలరించాయి. అంబేద్కర్ జీవితంలో ఆయన ఎదుర్కొన్న అవమానాలు, వాటిని ధైర్యంగా ఎదుర్కొని పోరాడిన తీరు ప్రజల్లో చైతన్యాన్ని నింపింది. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్‌బాబు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.రాఘవేంద్ర అధ్యక్షత వహించగా, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అబ్దుల్లా, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కరుణాకర్,మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, గ్రామ కార్యదర్శి విక్రమ్, ఉపాధ్యక్షులు లక్షప్ప, డివైఎఫ్ఐ నాయకులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



మహద్‌చెరువు ఉద్యమంలో అగ్రకుల అహంకారులు నిమ్న కులాల వారిపై దాడిని ప్రతిఘటిస్తున్న డాక్టర్ అంబేద్కర్ సన్నివేశం



మహద్‌చెరువు ఉద్యమంలో అగ్రకుల అహంకారులు చేతిలో గాయపడిన వారిని ఓదార్చి ధైర్యం నింపుతున్న అంబేద్కర్



నిమ్మకులాల వారిని దేవాలయ ప్రవేశాన్ని అడ్డుకున్న బ్రాహ్మణులకు జ్ఞానోదయం కలిగిస్తున్న డాక్టర్ అంబేద్కర్ దృశ్యం



పోరాటాలకు సిద్ధం చేసి సంఘటిత పరుస్తున్న అంబేద్కర్



సంఘం చరణం గచ్ఛామి నాటకంలో చివరి సన్నివేశం



సంఘం చరణం గచ్ఛామి నాటకాన్ని తిలకిస్తున్న పెద్దపాడు గ్రామస్తులు

ఎస్,ఎస్‌టి డివిఎంసి సభ్యుడిగా మద్దిలేటి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



విష్ణువర్ధన్‌రెడ్డితో మద్దిలేటి, యువనాయకుడు వెంకటేష్, తదితరులు

కర్నూలు మండలం ఉల్చాల గ్రామానికి చెందిన టిడిపి నాయకులు ఎం.మద్దిలేటి జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా ఎంపికయ్యారు. ఆయన ఎన్నికకు సంపూర్ణ సహాయ సహకారాలు అందించిన కోడుమూరు నియోజకవర్గం సీనియర్ టిడిపి నాయకులు డి.విష్ణువర్ధన్ రెడ్డిని, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని, ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిసి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తనకు వచ్చిన అవకాశాన్ని ఉపయోగించి ఎస్‌సి, ఎస్‌టిల తరుపున గళం విప్పుతానని అన్నారు. మద్దిలేటికి పలువురు టిడిపి నాయకులు, గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు. ఆయన వెంట టిడిపి మండల కన్వీనర్ బుర్ర వెంకటేశ్, సర్పంచి సురేష్ ,హెచ్ డి సి మెంబర్ రామాంజనేయులు, టిడిపి యువ నాయకులు చందు, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

టూరిజం ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో టూరిజం ప్రాంతాలను పబ్లిక్ ప్రయివేట్ పార్ట్‌నర్ షిప్ విధానంలో అభివృద్ధి చేసేందుకు పెట్టుబడుదారులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆదోని రామజల చెరువు, గాజులదిన్నె దామోదరం సంజీవయ్య సాగర్ ప్రాజెక్ట్, తుగ్గలి మండలం ఎర్రగుడి గ్రామం వద్ద అశోకుని శిలాశాసనాలు, ఆదోని మండలంలోని బనవాసి గ్రామం, పెద్దతుంబళం జైన్ దేవాలయం, కల్లూరు మండలం లక్ష్మీపురం వద్ద ఉన్న శ్రీ లక్ష్మీ జగన్నాథగట్టు, ఓర్వకల్లు రాక్‌గార్డెన్, గార్గేయపురం చెరువు ప్రాంతాలను పర్యాటక పరంగా రెస్టారెంట్లు, రిసార్ట్స్, పార్కులు తదితర నిర్మాణాలను అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న పెట్టుబడిదారులు జిల్లాలోని టూరిజం ప్రాంతాలను పబ్లిక్ ప్రయివేట్ పార్ట్‌నర్ షిప్ విధానంలో అభివృద్ధి చేసేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. పూర్తి వివరాలకు 6309942034 మొబైల్ నెంబర్‌ను సంప్రదించాలని కలెక్టర్ కోరారు

కర్నూలు డిప్యూటీ డిఇఒగా రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్



కర్నూల్ డివిజన్ డిప్యూటీ డిఇఒగా జి.రాజేంద్రప్రసాద్ మంగళవారం డిఇఒ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం ఆయన ఆస్పరి మండల విద్యాశాఖ అధికారిగా కొనసాగుతున్నారు. ఆదోని మండల విద్యాశాఖ అధికారి అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఇటీవల ఉద్యోగ విరమణ చెందిన హనుమంతరావు స్థానంలో రాజేంద్రప్రసాద్‌ను ఇన్‌ఛార్జి డిప్యూటీ డిఇఒగా ఆర్జెడి నియమించారు. ఈ సందర్భంగా ఆయన డిఇఒను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

24 నుండి ఉపాధ్యాయులకు వైద్య పరీక్షలు

ఉపాధ్యాయుల బదిలీల నేపథ్యంలో మెడికల్ కింద ప్రత్యేక పాయింట్లు పొందేందుకుగానుఈనెల 24వ తేదీ నుండి ఉపాధ్యాయులకు కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వైద్య పరీక్షల నిర్వహణకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసినట్లు డిఇఒ ఎస్ శామ్యూల్ పాల్ ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.